
క్లుప్తంగా

కనులపండువగా సీతారామ కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చాణక్య, హర్ష ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతభిషేకాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రచ్చబండను ప్రారంభించిన ఎమ్మెల్యే



రచ్చబండను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలోని సింగవరం గ్రామంలో నిర్మించిన రచ్చబండను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. పిట్టా అప్పలనారాయణమ్మ, బంగారినాయుడు జ్ఞాపకార్థం పిట్టా వెంకట సత్యనారాయణమూర్తి, వారి సోదరులు రూ.రెండున్నర లక్షల వ్యయంతో రచ్చబండను నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ పిట్టా పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి శ్రీనివాసరావు, పిట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకానిని కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో అవనాపు దంపతులు

విజయనగరం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని విజయనగరం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి డీసీఎంఎస్ సమీక్ష సమావేశం అనంతరం మంత్రిని దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సహకార మార్కెటింగ్ లక్ష్యాలను వివరించారు.

బాధ్యతల స్వీకరణ

బాడంగి: మండల పరిషత్ పరిపాలనాధికారిగా యు.రామలింగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రామభద్రపురం మండల పరిషత్ కార్యాలయం నుంచి ఏడీగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఓగా చేరి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరించిన కె.అక్కారావు బదిలీపై రామభద్రపురం వెళ్లారు.

బాడంగి: ఎంఈఓ–2గా ఎం.రాజేశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తల్లిదండ్రుల చెంతకు కుమారుడు

సంతకవిటి: కొన్నిరోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన విద్యార్థి దువ్వారపు మణికంఠను పోలీసులు అతడి తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. మణికంఠ శ్రీకాకుళం జిల్లాలోని సారవకోటలో ఉన్నట్లు గుర్తించి, అక్కడి వెళ్లి, విద్యార్థికి కౌన్సిలింగ్ ఇచ్చి నచ్చజెప్పినట్లు ఎస్ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు.

పండ్ల మొక్కల పంపిణీ

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అంబఖండి గ్రామాల్లోని రైతులకు పండ్ల మొక్కలు మంగళవారం పంపిణీ చేశారు. ఉద్యాన పంటల సాగులో భాగంగా ప్రభుత్వం అందజేసిన వీటిని అన్నదాతలకు ఉచితంగా అందజేసినట్లు ఏపీఓ ఎస్.హరనాధరావు తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఐదెకరాల లోపు పంట పొలాలు కలిగిన సన్న, చిన్నకారు రైతులకు బొప్పాయి, జామ, సపోటా, కొబ్బరి, జీడి మొక్కలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజా హితమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడప'లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలు మంజూరు చేయటం జరుగుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్ గాజులరేగ లోని, పడాల వీధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును వివరిస్తూ ప్రజాస్పందనను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై తీశారు. కాలువలు, వీధి దీపాలు సరిగా లేవని స్థానికులు వివరించగా వెంటనే అక్కడ ఉన్న అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజా రంజక పాలన సాగుతుందన్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రజల చెంతకే పాలనను తీసుకుని వెళుతున్నారని కొనియాడారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు మధు మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో ఆరవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతోందన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా సూచనలు చేయడం విశేషం అన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, మాజీ కౌన్సిలర్ గార సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



33వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్

కోలగట్లతోనే నగర అభివృద్ధి

విజయనగరం: సంక్షేమ సారథిగా.. అభివృద్ధికి వారధిగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నిలుస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 33వ డివిజన్ పరిధి బాలాజీ నగర్ వద్ద ఐదో రోజు మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గడపగడపకూ పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును తెలుసుకుంటూ, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. స్థానికంగా గుర్తించిన సమస్యలకు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. కార్పొరేటర్ జీవీ రంగారావు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జిలు ఎం.బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ శశి భార్గవి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకల జగాలకు రక్షకుడు జగన్నాథుడు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



జగన్నాథస్వామిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: సకల జగాలకు రక్షకుడుగా నిలుస్తున్న జగన్నాథస్వామి రథయాత్ర సందర్భంగా దేవతామూర్తులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కొలువు తీర్చిన రథయాత్రలో పాల్గొన్న ఆయన రథంపై జగన్నాథ్, బలభద్ర, సమేత సుభద్రాదేవి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు దైవ క్రతువులను నిర్వహించి, ఆశీస్సులను అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధిగాంచిన పూరీ పుణ్య క్షేత్రంలో కొలువైన జగన్నాథ స్వామి తొలి రథయాత్ర సందర్భంగా దేశంలో అనేక ప్రాంతాలలో ఆ దేవదేవునిని కొలువు తీర్చారన్నారు. నగరంలో దాసన్నపేట, సంతపేట, మూడు కోవెళ్లు, కొత్తపేట తదితర ప్రాంతాలలో జగన్నాథుణ్ణి కొలువుదీర్చి రథాలపై ప్రతిష్ఠించడం, ఆ తర్వాత దశావతారాల్లో స్వామి వారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించడం ప్రతి ఏటా వస్తున్న సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో కుమ్మరిగుంట శ్రీనివాసరావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల అడ్డగింత



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

భోగాపురం: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ముంజేరు గ్రామం సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలో ఎంపీడీఓ అప్పలనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల అధికారులు మంగళవారం చేపట్టిన కాలువ నిర్మాణ పనులను కాలనీవాసులు అడ్డుకున్నారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు.. ముంజేరు గ్రామంలో నివాసముంటున్న ప్రజల వాడుక నీరు ఇతర కాలువ ద్వారా బయటకు పోతుంది. ఇందులో ఓ కాలువ సిద్ధార్థనగర్ మీదుగా వెళ్తోంది. ఈ కాలువను పక్కగా నిర్మించడానికి 2022 డిసెంబర్‌లో సుమారు రూ.4 లక్షలు పంచాయతీ మరియు ఎంపీపీ గ్రాంట్ ద్వారా నిధులు మంజూరు చేస్తూ కాంట్రాక్ట్ పనులను డ్వాక్రా మహిళకు అప్పగించారు. దీంతో అప్పట్లో ఆమె పనులు చేపట్టగా సిద్ధార్థనగర్ కాలనీవాసులు అడ్డుకున్నారు. వాడుకనీరు తమ ప్రాంతం మీదుగా వెళ్లడానికి వీల్లేదంటూ పనులను నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు కాలువ నిర్మాణం కోసం పలుమార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించడం ద్వారా విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీనిపై ఆర్డీఓ సూర్యకళ స్పందిస్తూ ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలను తీసుకొని నివేదికను కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వానికి సంబంధించిన రాస్తా భూమిలో కాలువ నిర్మాణ పనులను ప్రారంభించగా కాలనీవాసులు అడ్డుకున్నారు. అధికారులు కాలనీవాసులకు ఎంత నచ్చజెప్పిన వారు వినకపోవండతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు. సీఐ విజయనాథ్, ఎస్ఐలు కృష్ణమూర్తి, మహేష్, నరేష్, శ్రీనివాసరావు, సూర్యకుమారి, పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా...

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల తదితరులు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 6, 7 డివిజన్లలో 24 లక్షల రూపాయలతో నిర్మించిన రహదారులను ఆయన మంగళవారం ప్రారంభించారు. నగరంలోని 22వ డివిజన్ బాసిన వీధిలో కాలువ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ మంగళవారం రూ.35 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో ఆయన కృషి చేస్తున్నారన్నారు. 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ తమ డివిజన్‌లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కల్పిస్తున్నారన్నారు. 6వ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన తమ వార్డు గడిచిన నాలుగేళ్లలో అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్, జోనల్ ఇన్‌చార్జిలు కోలగట్ల కృష్ణారావు, కంటుభుక్త తవిటిరాజు, ఎస్.బంగారు నాయుడు, ముచ్చు శ్రీనివాసరావు, మారం బాలబ్రహ్మారెడ్డి, బోడసింగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుప్రాయంలోనే పురస్కారాలు గర్వకారణం

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు

విజయనగరం: పదో తరగతిలోనే విద్యార్థులు సత్కారం పొందడం గొప్ప ప్రశంసని, వారి తల్లిదండ్రులకు గర్వకారణం అని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డారని, ఇదే స్ఫూర్తిని మున్ముందూ కొనసాగించి ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పది, ఇంటర్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థులకు మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. ముందుగా వాసవీమాత చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ చూపుతున్న ఆర్యవైశ్య బిడ్డలను గుర్తించి, ప్రోత్సహించిన అవోపాకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని మర్చిపోవద్దని సూచించారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి నలుగురికి ఉపాధి కల్పించేలా, అందరికీ మంచి చేసేలా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అతిథులుగా బండారు బంగార్రాజు, ఎం.వి.వి సత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ రవ్వా శ్రీనివాస్ మాట్లాడారు. అవోపా అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, కార్యదర్శి తవ్వా మోహనరావు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యనారాయణ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

జగనన్న సురక్షపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్, కౌలు రౌతుల రుణ అర్హత పత్రం, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం, పెళ్లి ధ్రువీకరణ పత్రం తదితర పత్రాల మంజూరుకు లబ్ధిదారుని నుండి సేకరించాల్సిన ధ్రువపత్రాలు, అప్‌లోడ్, మంజూరుపై శిక్షణ అందించారు. మండలంలో 13 గ్రామ సచివాలయాల్లో ప్రజలకు ఈ సేవలు త్వరితగతిన అందించేందుకు ఎంపీడీవో, తహసీల్దార్లను రెండు బృందాలుగా ఏర్పాటు చేసి ప్రతీ సచివాలయాన్ని వారానికి రెండుసార్లు సందర్శించి ఆయా ధ్రువపత్రాలు మంజూరు అయ్యేలా చూడాలని ఎంపీపీ అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంటా వెంకటరావు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పంచాయతీ విస్తరణాదికారి డి.తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శుభ

విజయనగరం అర్బన్: మానవ జీవితంలో యోగాను దైనందిక ప్రక్రియలుగా ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుభ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యోగా ఆవశ్యకతపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మానవ శరీర అంతర్భాగాల పనితీరు వాటిలో యోగ ప్రాముఖ్యత వివరించారు. ప్రాణాయామం, దాని ఆవశ్యకతను తెలిజేశారు. బుధవారం ఉదయం 9.00 గంటలకు కళాశాల నుంచి కోట జంక్షన్ వరకు యోగా అవగాహన ర్యాలీని, అనంతరం యోగాసనాలు మరియు మెడిటేషన్ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ డాక్టర్ జయలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.రామకృష్ణ, సీహెచ్.సీతారత్నం, పి.చంటిబాబు, కే.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న మార్వాడీ యువమంచ్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం వచ్చిన భక్తులు దాహార్తిని తీర్చేందుకు మార్వాడీ యువ మంచ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆలయ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మనోజ్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఎండలు విపరీతంగా ఉండడంతో పాదచారులు, భక్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. తమవంతు బాధ్యతగా వారికి మజ్జిగ పంపిణీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భరత్ కొఠారి, అర్పిత్ జైన్, ఉమేష్ అగర్వాల్, కోశాధికారి కమల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలి

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్ మిల్లుకు చెందిన రిటైర్డు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కే రామారావు డిమాండ్ చేశారు. స్థానిక మిల్లు గేటు వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016వ సంవత్సరం నుంచి బకాయిలు పేరుకుపోయాయన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను కూడా సంబంధిత సంస్థలకు మిల్లు యాజమాన్యం చెల్లించడం లేదని ఆరోపించారు. గతంలో కార్మికుల నుంచి అప్పుగా తీసుకున్న మొత్తాలను వెంటనే చెల్లించాలని రామారావు డిమాండ్ చేశారు.

నేడు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఐ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ–2 ఎం.రాజేశ్వరి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ పరీక్ష ఉంటుందని, ఒక్కో పాఠశాల నుంచి ఓ టీచరు, ఇద్దరు విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు



ఉద్దవోలులో పశుబీమా ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని ఉద్దవోలు పశువైద్య కేంద్రం వద్ద పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ వద్ద ఉన్న పశువులకు పశుబీమా చేయించుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు అవి మరణిస్తే ప్రభుత్వమే పశుబీమా కింద నగదు చెల్లిస్తుందన్నారు. రైతుల వద్ద ఉన్న ఆవుకి మూడేళ్లకు రూ.397, గొర్రె, మేకలకు ఏడాదికి రూ.36 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పశుబీమా చేసిన పశువులు విద్యుత్ షాక్ గానీ, పిడుగుపాటుకు గానీ, మరే ఇతర కారణాలతో మరణిస్తే పశు బీమా పథకం వర్తిస్తుందన్నారు. అనంతరం 52 పశువులకు సంబంధించి, రైతులు బీమా నమోదు చేయించారు. రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న గ్రామ పశు సంవర్ధక సహాయకులు గ్రామాల్లోని రైతుల వద్ద ఉన్న పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పశువుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు అందివ్వాలన్నారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ బొబ్బిలి డిప్యూటీ డైరెక్టర్ నీలయ్య, తెర్లాం, బాడంగి మండలాల అదనపు డైరెక్టర్ నాగరాజు, నెమలాం పశువైద్య కేంద్రం డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథయాత్ర



కోలాటంలో భక్తులు

జగన్నాథుని రథయాత్ర మహోత్సవం పట్టణంలో పలు ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా మంగళవారం జరిగింది. సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో కొలువై ఉన్న స్వామిని దర్శించుకునేందుకు రథం వద్ద భక్తులు బారులు తీరారు. రథయాత్రలో భక్తులు కోలాటంతో అలరించారు.

– విజయనగరం టౌన్



రథం వద్ద స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

శరవేగంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం



గడిముడిదాంలో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మండలంలోని గడిముడిదాం గ్రామంలో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌ను ఎంపీడీఓ బాసూరి శంకరరావు పరిశీలించారు. మండలంలో మొత్తం 11 కేంద్రాలు నిర్మించాల్సి ఉండగా, ఐదు కేంద్రాల నిర్మాణం తుది దశకు చేరుకుందని, రెండు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పీఆర్ జేఈ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.